క్లుప్తంగా

ఆధ్యాత్మిక గ్రంథాలను చదవాలి


భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత సేవా సమితి

పాములపాడు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక గ్రంథాలను చదవాలని త్రైత సిద్ధాంత సేవా సమితి అధ్యక్షుడు రాచంద్రుడు అన్నారు. సోమవారం మండలంలోని వేంపెంట గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తూ గ్రంథాలను పంపిణీ చేశారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయంలో 16, 17 శ్లోకాలు వివరించారు. కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు కుమారాచారి, సంజీవ, శ్రీనివాసులు, రవిచంద్రుడు, సుబ్బలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు బీసీజీ టీకా


చెంచు గూడెంలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రవికుమార్

పాములపాడు : క్షయ వ్యాధి నిర్మూలన కోసమే బీసీజీ టీకా అని సూపర్‌వైజర్ రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వేంపెంట గ్రామం చెంచు గూడెంలో క్షయ వ్యాధి నిర్మూలన, బీసీజీ టీకా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ టీకా వేయడం వల్ల క్షయ వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. 60 సంవత్సరాలు పై బడిన వారు, 18 సంవత్సరాలు పైబడిని షుగర్ వ్యాధి బాధితులు టీకాలను వేయించుకోవాలని సూచించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది నిర్వహించే ఇంటింటి సర్వేకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ భారతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన రహదారి ప్రారంభం


నూతన రహదారిని ప్రారంభిస్తున్న కో ఆప్షన్‌సభ్యులు రషీద్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని 18వ వార్డు పరిధిలో నూతన సీసీ రోడ్డు పనులకు కో ఆప్షన్ సభ్యుడు రషీద్, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయ్‌చౌదరి సోమవారం భూమిపూజ చేశారు. ఇందిరానగర్ కాలనీలో రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని, రహదారిని మంజూరు చేయించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ప్రకాష్‌రావు, శంకర్, మోతుల్లా, తిమోతి పాల్గొన్నారు.

సమస్యలు లిఖితపూర్వకంగా తెలియజేయాలి

జూపాడుబంగ్లా: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే జగనన్నకు చెబుతాం-స్పందన కార్యక్రమంలో లిఖితపూర్వకంగా సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తామని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుతాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు వారి వ్యక్తిగత, గ్రామాల్లోని సమస్యలపై అర్జీలు సమర్పించాలన్నారు. వాటిని ఆయా శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని చెప్పారు. పారుమంచాల మజరా కొత్తసిద్దేశ్వరం గ్రామంలోని గిరిజనులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, గిరిజనులకు ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని అర్జీలు ఇచ్చారు.

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమం ద్వారా గ్రామాలోలని సమస్యకు సత్వరమే పరిష్కరిస్తోందని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. స్పందనలో ఇద్దరు రైతుల మధ్య ఆర్‌ఓఆర్‌లో సమస్య, ఆన్‌లైన్ సమస్య, భూమి కొలతల సమస్యకు చెందిన 2 అర్జీలు దుద్యాల, 1 ఎర్రమఠం గ్రామం నుంచి వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించేందకు అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి


ఆయుష్మాన్ కార్డుల పంపిణీ చేస్తున్న దృశ్యం

మిడుతూరు: గ్రామీణ ప్రాంత ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని మండల నోడల్ అధికారి, ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి అన్నారు. సోమవారం మండలపరిధిలోని అలగనూరు, రోళ్లపాడు గ్రామాల్లో సర్పంచ్‌లు కృష్ణవేణమ్మ, పేరెడ్డి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. పొలంలో డ్రోన్ కెమెరాలతో పిచికారీ చేయడంపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా మైక్రో కో- ఆర్డినేటర్ చింత నాగేశ్వరరావు, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, ఏఓ పీరునాయక్, వెలుగు ఏపీఎం సుబ్బయ్య పాల్గొన్నారు.

హర హర మహాదేవ శంభో శంకర

- శైవాలయాల్లో మార్మోగిన శివనామస్మరణ
- కార్తీకమాస చివరి సోమవారం ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- కార్తిక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు

మహానంది: కార్తీక మాసం, చివరి సోమవారం సందర్భంగా మహానంది ఆలయం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ముందుగా ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం, నంది స్థూపం, నాగులకట్ట ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేశారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో వేకువజామున నాలుగున్నర గంటలకే మహా మంగళ హారతుల దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈఓ కాపు. చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మహానందిలో తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. తమ్మడపల్లె సమీపంలో ఉన్న నవనందుల్లో ఒకటైన శ్రీ సూర్యనందీశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. ఆర్జిత సేవా టికెట్లు, వసతి గహాలు, ప్రసాదాల విక్రయ విభాగాల ద్వారా ఆలయానికి ఒకేరోజు సుమారు రూ. 10 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు సమాచారం.

మహానందీశ్వరుడికి లక్ష బిల్వార్చన

కార్తీకమాసం, మాసశివరాత్రి సందర్భంగా మహానందిలో లక్ష బిల్వార్చన పూజలు వైభవంగా జరిగాయి. నంద్యాలకు చెందిన రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పీఠార్చనలు నిర్వహించి మహన్యాసం చేసి 121 రుద్రాలతో మహా రుద్రాభిషేకం జరిపారు. కార్తీక మాసం అమావాస్య పురస్కరించుకుని మంగళవారం మహానందిలో లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు

శైవ క్షేత్రాల్లో పోలీసు బందోబస్తు

కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మహానంది, ఓంకారం, భోగేశ్వరం తదితరాలయాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. మహానందిలో సోమవారం పూజలు నిర్వహించారు. మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్, సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు.

భక్తులతో కళకళలాడిన ఓంకారం

కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన ఓంకారం ఆలయం భక్తులతో కిక్కిరిసింది. భక్తులు పంచబుగ్గల కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తితో పూజలు చేపట్టారు. శ్రీ కాశిరెడ్డి నాయన అన్నప్రసాద వితరణ కేంద్రం వద్ద భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈఓ నాగప్రసాద్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ విశ్వనాథ రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

రుద్రకోడూరుకు పోటెత్తిన భక్తులు

ఆత్మకూరు: కార్తీకమాసం చివరి సోమవారంతో శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. నల్లమల అభయారణ్యంలోని రుద్రకోడూరు క్షేత్రం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ క్షేత్రంలో పెద్ద ఎత్తున వందలాది మంది భక్తులు నల్లమల అడవీమార్గం గుండా వెళ్లారు. వివిధ వాహనాల్లో వెళ్లిన భక్తుల శ్రీరుద్రకోటేశ్వర, రుద్రాణి మాతను దర్శించి, విశేషపూజలు నిర్వహించుకున్నారు. కోనేరులో పవిత్రస్నానమాచరించి , కార్తీకదీపాలను వెలిగించారు. అలాగే పట్టణంలోని వివిధ శివాలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించి కార్తీకదీపాలను వెలిగించారు. పట్టణంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కోటి బిల్వార్చనతో విశేషపూజలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

పగిడ్యాల: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లోని నాగేశ్వరస్వామి, అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామి దేవాలయాల వద్ద లక్ష బిల్వార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు జగదీశ్వరయ్య బిల్వార్చన వేడుకలను శాస్త్రోక్తంగా జరిపించారు. గ్రామ పెద్దల సహకారంతో పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

అన్నదానం

పగిడ్యాల బంగ్లా కట్ట వద్ద వెలసిన సర్వేశ్వరస్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఆనవాయితీ ప్రకారం గ్రామానికి చెందిన బన్నూరు వంశస్తులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


ఓంకారంలో వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సంగమతీరం కార్తీక శోభితం

కొత్తపల్లి: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో సప్తనదుల సంగమ తీరం సంగమేశ్వరం కార్తీక శోభితమయమయ్యింది. మండలంలోని ప్రాచీన ఆలయాలైన సంగమేశ్వరం, కొలనుభారతి దేవి ఆలయాలో భక్తులు ప్రత్యేక పూజ లు చేసుకున్నారు. సంగమేశ్వరంలో రాష్ట్ర నలుమూ లల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చెరుకొని భక్తితో పూజలు నిర్వహించారు. కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేసుకున్నారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న లోకాయుక్త జడ్జి దంపతులు

సంగమేశ్వర ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జడ్జి పి.లక్ష్మణరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆలయ సంప్రదాయానుసారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని వేపదారు శివలింగానికి కుంకుమార్చన, పుష్పార్చన, నదీజలాలతో అభిషేకం, మంగళహారతి వంటి విశేషపూజలు చేసుకున్నారు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, కొలనుభారతి ఈఓ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామ సమీపంలో భవనాశి నది ఒడ్డున వెలసిన, శ్రీశైలానికి ప్రథమ ముఖద్వారమైన నందీశ్వరాలయంలో కార్తీక మాసం చివరి సోమవారం రోజున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాండవులచే ప్రతిష్ఠించబడిన ఆలయంలో శివలింగం, కొలువు దీరిన వినాయకుడు, సప్తరుషుల విగ్రహాలు, శ్రీశైలేషుడి పాద ముద్రికలకు కాయ, కర్పూరాలు సమర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మధుసూదన్‌రావు, సర్పంచు మంగమ్మబాయి, భక్తులు పాల్గొన్నారు.


నందీశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

జూపాడుబంగ్లా: కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని మండలంలోని తాటిపాడు శ్రీవీరభద్రస్వామి ఆలయం, జూపాడు ఈశ్వర,చెన్నకేశవ, ఆంజనేయస్వామి, తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి, తూడిచెర్ల శంకరమల్లేశ్వరస్వామి, ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉదయాన్నే చన్నీటితో స్నానమాచరించి ఆలయాల్లో స్వామివార్లకు పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల వెలుపల దీపపు చిమ్మెల్లో, ఉసిరికాయలపై కార్తీకదీపాలు వెలిగించారు.


తర్తూరులో భక్తులకు దేదీప్యమానంగా దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి


ఆత్మకూరులో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


మహానందీశ్వర స్వామి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు


మహానందిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, పండితులు


మహానందిలో పూజలు నిర్వహిస్తున్న డీఎస్పీ మహేశ్వర రెడ్డి

మల్లన్నను దర్శించుకున్న మాజీ మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. వీరి వెంట ట్రస్ట్‌బోర్డ్ సభ్యురాలు కనకదుర్గ ఉన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పాకార్తీక్‌రెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


ఆలయప్రాంగణంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఐకమత్యానికి చిహ్నం వనభోజనాలు


కార్తీక వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న చెంచుగిరిజనులు

వెలుగోడు: సంప్రదాయంగా నిర్వహిస్తున్న వనభోజనాలు ఐకమత్యానికి చిహ్నంగా నిలుస్తున్నాయని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణ శివారులోని వన్ ఆర్ తూము వద్ద వెలిసిన సర్వేశ్వరస్వామి ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మన్న ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే, ఎథిక్స్ కమిటీ చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం చెంచుగూడెంలో కార్తీకవన భోజనం

ఆత్మకూరు: మండలంలోని అమలాపురం చెంచుగూడెంలో సోమవారం కార్తీకమాస వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రాజు నాయక్, రవి నాయక్, బాలు నాయక్‌లు గిరిజనులు సకల శుభాలు కలగాలని కోరారు.

మహానందిలో ఏపీ ఐజీ పూజలు

మహానంది: మహానంది క్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ సోమవారం పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, సీఐ రవీంద్ర, ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ స్వాగతం పలికారు. ఈ మేరకు వారు స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.


ఐజీ త్రివిక్రమ వర్మకు మెమొంటో అందిస్తున్న ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి

పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి ఈ-కేవైసీ తప్పనిసరి

వెలుగోడు: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 16వ విడత సాయం అందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ పవన్‌కుమార్ తెలిపారు. రబీలో సాగు చేసిన పంటల ఈ- క్రాప్ నమోదు కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేయని వాళ్లు వెంటనే చేయించుకొని భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఆధార్‌తో బ్యాంక్ అకౌంట్ లింక్ అయిన వారికి మాత్రమే ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు.

రబీ పంటలు ఈ క్రాప్ నమోదు చేయించుకోండి

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు సత్వరమే ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల వద్ద ఈక్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల రబీ సాధారణ సాగు విస్తీర్ణం కంటే తక్కువగా సాగైనట్లు తెలిపారు. పంటలు సాగుచేసిన రైతులు ఆర్బీకేల వద్దకు ఆధార్ కార్డు జిరాక్సు తీసుకెళ్లి ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు.

పోస్టర్ల విడుదల

ఆత్మకూరు: కర్నూలు నగరంలో ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్న అఖిలభారత రైతు సంఘం కౌన్సిలర్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం పోస్టర్లు విడుదల చేశారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, రైతు సంఘం మండల అధ్యక్షుడు బాషా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులపై వివక్ష చూపుతోందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు , వ్యవసాయ పనిముట్లు, ధరలు పెంచారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామ్‌నాయక్, నరసింహనాయక్, సుధాకర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన సదస్సు


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న వీఆర్వో ప్రదీప్

శ్రీశైలం: రానున్న ఎన్నికల్లో ప్రజలకు ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటర్‌మిషన్) ల వినియోగంపై సోమవారం సాయంత్రం శ్రీశైలంలోని 4వ సచివాలయంలో వీఆర్వో ప్రదీప్ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎలాంటి అపోహలకు తావివ్వకుండ పారదర్శకంగా ఈవీఎంల పనితీరు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎంఏ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

పాములపాడు: పాములపాడును కరువు మండలంగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏపీ రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లలో వర్షాలు తగినంత కురవకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఈ నెల 15,16,17 తేదీల్లో కర్నూలు పట్టణంలో నిర్వహించనున్న ఏపీ రైతు సంఘం ఆలిండియా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు వెంకటేశ్వరరావు, స్వామన్న, నారాయణ, రమణ పాల్గొన్నారు.

గ్రంథాలయం స్థలం ఖాళీ చేయాలి

నందికొట్కూరు: పట్టణంలోని గ్రంథాలయానికి సంబంధించిన స్థలం ఖాళీ చేయాలని ఎస్ఐ హుసేన్‌బాషా హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని గ్రంథాలయ స్థలాన్ని ఆక్రమించిన వారిని ఖాళీ చేయించేసేందుకు ఒప్పించారు. ఆయన మాట్లాడుతూ స్థలంలో వ్యాపారాలు చేసుకునే ప్రజలు వెంటనే ఖాళీ చేయాలన్నారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి వ్యాపారులు సహకరించాలని కోరారు.

నేడు స్వచ్ఛ గ్రంథాలయం..

మంగళవారం స్వచ్ఛ గ్రంథాలయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ మురళీ తెలిపారు. కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ హాజరవుతారని చెప్పారు.

పని వద్దు.. బడి ముద్దు

పగిడ్యాల: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని పని వద్దు.. బడి ముద్దు అంటూ ఎంపీడీఓ వెంకటరమణ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని బీరవోలు, ఆంజనేయనగర్ గ్రామాల్లో జీఈఆర్ 100 శాతం సర్వేపై ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఎంఈఓ సుభాన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ఎంపీడీఓ ముఖ్య అతిథిగా హాజరై జీఈఆర్ సర్వే ప్రాముఖ్యతను వెల్లడించారు. ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న ఉన్నారు.

కొత్తపల్లి: గ్రామాలలో చాలా కాలంనుంచి బడికి పోకుండా బయట తిరుగుతున్న బడిఈడు పిల్లలను గుర్తించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. సోమవారం దుద్యాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.మంగన్న ఆధ్వర్యంలో జీఈఆర్ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రుచికరమైన అన్నప్రసాదాన్ని అందించాలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన అన్నప్రసాద వితరణ భవనంలో తయారుచేసే వంటకాలన్నీ రుచికరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని దేవస్థాన అధికారులను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి ఆదేశించారు. సోమవారం శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ అన్నప్రసాద వితరణ, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ జరుగుతుండాలని సూచించారు. రుచికరమైన అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. సిబ్బంది భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. అన్నదాన మందిరంలో శుచి, శుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని, ఎప్పటికప్పుడు అన్నదాన మందిరాన్ని శుభ్రపరుస్తుండాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే అన్నదాన భవనంలో ఏర్పాటు చేసిన స్టీమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దేవస్థానం చైర్మన్‌రెడ్డివారి చక్రపాణిరెడ్డి

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన


సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్

ఆత్మకూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమం సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, జేసీఎస్ అధ్యక్షుడులు సుల్తాన్, కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ విజయ్, హరి అన్నారు. పట్టణంలోని అర్బన్‌కాలనీ సచివాలయ పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక పేదలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రతి నిరుపేద కు లబ్ధి చేకూరుతోందని చెప్పారు. సచివాలయ పరిధిలో రూ.25,31,38,072 వివిధ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమ అయిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు స్వామి, లాలు, యునస్, వరాల మాలిక్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.


సిద్ధాపురంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి

సిద్ధాపురంలో ..

మండలంలోని సిద్ధాపురం గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్, సిద్ధాపురం సర్పంచ్ నాగులు నాయక్, శివశంకర్‌నాయక్, రవినాయక్‌లు మాట్లాడుతూ సచివాలయం పరిధఇలో రూ.21,59,04,816లు లబ్ధిదారులకు జమ అయ్యాయని చెప్పారు.

మాట తప్పని.. మడమ తప్పని యోధుడు


వెలుగోడులో బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి

వెలుగోడు: మాట తప్పని, మడమ తిప్పని యోధుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో పార్టీ జెండాను ఎగురవేసిన అంబాల ప్రభాకర్‌రెడ్డి.. నాలుగున్నరేళ్లలో సచివాలయ పరిధిలోని ప్రజలు పొందిన లబ్ధిని వివరిస్తూ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటా పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, మండల కార్యదర్శి కే.రామ్మోహన్ రెడ్డి, అమీర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు రూరల్: స్పందనలో వచ్చే సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా త్వరగా పరిష్కరించాలని మండల తహసీల్దార్ రాజశేఖర్‌బాబు సూచించారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఎస్.ఐ హుసేన్‌బాషా పాల్గొన్నారు.